క్లుప్తంగా

మొగల్తూరులో పారిశుద్ధ్య పనులు



పేరుకుపోయిన నీటిని తొలగించేందుకు జేసీబీతో గోతులు తీయిస్తున్న పంచాయతీ సిబ్బంది

మొగల్తూరు: ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల స్థానిక ఉన్నత పాఠశాల, నెంబర్–1 పాఠశాల ప్రాంతాలు పూర్తిగా నీటమునిగాయి. దీంతో గ్రామస్తులతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సర్పంచ్ పడవల మేరీ పల్లపు ప్రాంతాలలో నిలిచిపోయిన నీటిని కోనాయికోడు మురుగు కాలువలోకి వెళ్లేలా పనులు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. మొగల్తూరు ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిపోయిన నీటిని నాలుగు ఇంజిన్లు వేసి కాలువలోకి, నెంబర్–1 పాఠశాల ఆవరణతో పాటు ప్రధాన రహదారికి ఇరువైపులా నిలిచిపోయిన నీటిని కోనాయికోడులో వెళ్లేలా పంచాయతీ సిబ్బంది శుక్రవారం పనులు చేపట్టారు. జేసీబీలు ఏర్పాటు చేసి గోతులు తీసి కోనాయికోడులోకి మళ్లిస్తున్నారు.

నరసాపురం-భీమవరం బస్సు సర్వీసుల పెంపు



ఎస్.సుబ్బన్నరెడ్డి

నరసాపురం: ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా నరసాపురం–భీమవరం మధ్య విస్తృతంగా బస్సు సర్వీసులను పెంచి తిప్పుతున్నామని నరసాపురం డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ బస్సులు కలిపి ప్రతిరోజూ భీమవరానికి 29 ట్రిప్పులు తిప్పుతున్నామని చెప్పారు. ఉదయం 5.15 గంటలు నుంచి రాత్రి 7.30 గంటల వరకూ నరసాపురం బస్టాండ్ నుంచి భీమవరానికి బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించాలని కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



29వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వెంకటరమణ

నరసాపురం: అధిక వర్షాల కారణంగా పట్టణంలో ముంపునకు గురైన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె పట్టణంలోని 29వ వార్డులో పర్యటించారు. వార్డుల్లో వర్షపు నీరు నిల్వ ఉన్న చోట్ల పరిస్థితిని పరిశీలించారు. ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆమె వెంట ఏఈ సునీల్, అడిదల శరత్ తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు సాయం

పెనుగొండ: విజయవాడలోని వరద బాధితులకు సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది రూ.25వేలు సహాయాన్ని అందించారు. ఈ సాయాన్ని శుక్రవారం జిల్లా కలెక్టరుకు భీమవరంలోఅందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేఎస్ఎస్‌వీ ప్రసాద్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దొంగరావిపాలెంలో

పెనుగొండ: విజయవాడ వరద బాధితులకు కూరగాయలు, నిత్యావసర వస్తువులను కూటమి నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం అందించారు. ఈ వాహనాన్ని దొంగరావిపాలెంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆచంట జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు, సర్పంచ్‌లు చింతపల్లి గనిరాజు(చంటి), కే సుబ్రహ్మణ్యం, కూన రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



సుధీర్‌బాబును సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై సుధీర్ బాబును శుక్రవారం విద్యార్థులు గ్రామస్తులు సత్కరించారు. సుధీర్‌బాబు పనిచేసే స్పెషల్ ఎస్ఎల్ఎన్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉషారాణి, సత్యవాణి, శ్రీలక్ష్మీ, చంద్రశేఖర్, లెనిన్ హైస్కూల్ స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ గీతాబాల తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యల తిష్ట

- గురుకుల పాఠశాలల్లో కానరాని కేర్ టేకర్లు
- విద్యార్థులే భోజనాలు వడ్డించుకుంటున్న వైనం



పాలకొల్లు బ్రాడీపేట బైపాస్‌రోడ్డులో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో భోజనాలు వడ్డించేందుకు సిద్ధమైన విద్యార్థులు

నరసాపురం రూరల్: బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉండే వసతి గృహాల్లో సమస్యలు తిష్ట వేశాయి. ముఖ్యంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. హాస్టల్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో నాలుగైదు హాస్టల్స్‌కు ఒకే వార్డెన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. నరసాపురం పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహం మినహా మిగతా హాస్టల్స్ అన్నీ కాలం చెల్లిన అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దాదాపు అన్ని హాస్టల్స్ ఆవరణల్లోనూ అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. స్టేషన్‌పేటలోని మత్స్యకార గురుకుల బాలుర పాఠశాలలో సరైన వసతులు లేవు. రెండు వందల మంది విద్యార్థులకు కేవలం రెండు డార్మెంటరీలు, కేవలం 14 టాయిలెట్స్ మాత్రమే ఉండటంతో వందలాదిమంది విద్యార్థులు సమస్యను ఎదుర్కొంటున్నారు. లక్ష్మణేశ్వరంలోని బీసీ బాలికల గురుకుల పాఠశాల, మొగల్తూరులో ఉన్న రెండు హాస్టళ్ల ఆవరణలోనూ నీరు నిల్వ ఉంటుంది. బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు నేలపైనే కూర్చుని భోజనాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఎన్టీఆర్ కాలనీలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో తరచూ నీరు నిలిచిపోతుందని విద్యార్థులు వాపోతున్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో సమస్యలు తిష్ట వేశాయి. పాలకొల్లులోని గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు దాదాపు 260 మంది ఉన్నారు. ఈ గురుకులంలో విద్యార్థులే భోజనాలు వడ్డించుకుని తినే పరిస్థితి నెలకొని ఉంది. అలాగే విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాల్లో కూడా నాణ్యత లోపించింది. ప్రస్తుతం ఈ హాస్టల్ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు.



నరసాపురం పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో కంపుకొడుతున్న బాత్రూమ్‌లు



లక్ష్మణేశ్వరంలోని బాలికల గురుకుల పాఠశాల ప్రాంగణంలో నిలిచి ఉన్న మురుగునీరు

మట్టి విగ్రహాలనే పూజించాలి

మొగల్తూరు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ వినాయకుని పూజలో మట్టి విగ్రహాన్ని ఉపయోగించాలని శ్రీ గాయత్రి కేరళ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ జక్కంశెట్టి లోకేష్ కోరారు. వినాయక చవితి నేపథ్యంలో శుక్రవారం కాళీపట్నంలో కేరళ మోడల్ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. స్కూల్ డైరెక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

పెనుగొండ: ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడినట్లు రుజువైతే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ ఎం.ప్రభాకరరావు హెచ్చరించారు. శుక్రవారం ఆచంట ఎంపీడీఓ కార్యాలయం వద్ద జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ మండల సభ నిర్వహించారు. మండలంలో 1367 పనులు జరగ్గా రూ.6 కోట్లు 67 లక్షల 46 వేల 360 ఖర్చు పెట్టినట్లు తెలిపారు. దీనిలో రూ.5లక్షల మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపీపీలు యర్రగొప్పల నాగరాజు, తాళం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండలి ప్రతిపక్ష నేతగా బొత్స ఎంపికపై హర్షం



లోపింటి చిరంజీవి

పాలకొల్లు అర్బన్: శాసన మండలి ప్రతిపక్ష నేతగా బొత్స సత్యనారాయణ ఎంపిక చేయడం సరైన నిర్ణయమని వైఎస్సార్ సీపీ తూర్పుకాపు సంఘ నాయకుడు లోపింటి చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అలాగే వైఎస్సార్ సీపీ తూర్పు కాపు సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా మామిడి శ్రీకాంత్‌ని నియమించడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాల వారీగా యువతకు అవకాశాలు కల్పించాలని, పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా అడుగులు వేయడం పట్ల మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హర్షం ప్రకటించిన వారిలో వైఎస్సార్ సీపీ తూర్పు కాపు సంఘ నాయకులు గేదెల నరసింహరావు, జమ్ము కాశి, బాకూరి సత్య నిరంజన్, కంది శ్రీనివాస్, మామిడి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆకుకూరలతో రక్తహీనతకు చెక్

పాలకొల్లు అర్బన్: గర్భిణులు, బాలింతలు ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్యలు చెక్ పెట్టవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.మంగ చెప్పారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా సీడీపీవో పాలకొల్లు ప్రాజెక్టు సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని దగ్గులూరులో బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ వర్కర్లు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఎం.మార్తమ్మ, అంగన్‌వాడీ టీచర్ ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



దగ్గులూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సంచార జాతుల అభివృద్ధికి జగన్ కృషి



పెంద్ర వీరన్న

నరసాపురం రూరల్: సంచార జాతుల అభివృద్ధికి కృషి చేసింది మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ సంచార జాతుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పెంద్ర వీరన్న అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని సీతారామపురంలోని ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సంచార జాతుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా తనను నియమించడంపై వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సంచార జాతులకు పలు సంక్షేమ పథకాలు అందేవని, వాటితో తమ కష్టాలు తీరేవని వీరన్న పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి ఎన్నికల వాగ్దానాల్లో సూపర్ సిక్స్ పథకాలంటూ అమలు చేయలేని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం పక్కన పెట్టారని మండిపడ్డారు. ఎన్నికల వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మార్కెట్‌లో వినాయక చవితి సందడి

- జోరుగా పూజా సామగ్రి అమ్మకాలు
- అధిక ధరలతో సామాన్యుల బెంబేలు
- మండపాల వద్ద ఆకర్షిస్తున్న విద్యుత్ దీపాలంకరణలు



పాలకొల్లు సెంట్రల్: ఉత్సవాలకు ముస్తాబైన గణనాథులు



మొగల్తూరు: కనకదుర్గమ్మ ఆలయ ఆవరణలో వినాయక చవితికి ఏర్పాట్లు చేస్తున్న యువకులు



పాలకొల్లు సెంట్రల్: గోల్డ్ మార్కెట్ వద్ద ఆకర్షిస్తున్న విద్యుత్ దీపాలంకరణ



పెనుగొండ: ఆచంటలో పండ్లు దుకాణం



పెనుగొండ: సిద్ధాంతంలో పూజాసామగ్రి దుకాణం



నరసాపురం: వినాయకచవితి పూజా సామగ్రి అమ్మకాలతో సందడిగా ఉన్న నరసాపురం మార్కెట్

నరసాపురం: నరసాపురం మార్కెట్‌లో శుక్రవారం వినాయకచవితి సందడి నెలకొంది. ఉదయం నుంచి విగ్రహాలు, పత్రి, పళ్లు, పూలు అమ్మకాలు మార్కెట్‌లో జోరుగా సాగాయి. ప్రకాశం రోడ్డుకిరువైపులా పెద్ద ఎత్తున దుకాణాలు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగించారు. పాలవెల్లులు, అలంకరణ సామగ్రి అమ్మకాలు ఉత్సాహంగా సాగాయి. దీంతో మార్కెట్ ప్రాంతమంతా సందడి నెలకొంది. అయితే పండ్లు, పూలు రేట్లు మాత్రం విపరీతంగా పెరగడంతో జనం బెంబేలెత్తారు. యాపిల్ రూ.40, బత్తాయి ఒక్కొటి రూ.25, ఎలక్కాయ రూ.20 వరకూ అమ్మారు. దీంతో పూజా సామగ్రి కోసం మార్కెట్‌కు వచ్చిన వారు సగం సగం సరుకులు మాత్రమే కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణంలో పలు వార్డులు, ప్రధాన ప్రాంతాలు, ముఖ్యకూడళ్లలో వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు సాగుతున్నాయి.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: వినాయకచవితి సందర్భంగా పట్టణంలోని మెయిన్‌రోడ్డు అంతా వ్యాపారస్తులతో సందడి వాతావరణం నెలకొంది. నేటినుంచి తొమ్మిది రోజులు పాటు నిర్వహించనున్నారు. భక్తులు, ఉత్సవ నిర్వాహక కమిటీల సభ్యుల ఆధ్వర్యంలో వాడవాడలా మండపాలను నెలకొల్పారు. ఉత్సవాలు ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్రవారం పట్టణ ప్రధాన రహదారి జనంతో కిక్కిరిసిపోయింది. పట్టణంలో దాదాపుగా 50 గణపతి మండపాలు నిర్వహించే విధంగా ఉత్సవ కమిటీల సభ్యులు సన్నాహాలు చేశారు. వినాయకచవితి ఉత్సవాల నిర్వాహకులు మండపాల ఏర్పాట్లలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని మండపాల నిర్వాహకులకు పట్టణ సిఐ కె. రజనీకుమార్ పలు సూచనలు చేశారు. మండపం ఏర్పాటు కొరకు పోలీస్‌స్టేషన్లో ముందుగా అనుమతులు తీసుకోవాలని, ప్రతి మండపానికీ సంబంధించిన నిర్వాహకుల్లో ఐదుగురు వ్యక్తుల ఫోన్ నెంబర్లు, గుర్తింపు కార్డు జిరాక్సు కాపీలు ఇవ్వాలని స్పష్టం చేశారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: వినాయక చవితి వేడుకలకు ఊరూవాడా సిద్ధం అయ్యింది. మండలంలోని పలు గ్రామాల్లోని వినాయకుని ఆలయాలతో పాటు ప్రధాన కూడళ్లలోనూ వినాయకుని విగ్రహాలు నిలబెట్టేందుకు మండపాలు సిద్ధం చేశారు.

ఆచంట నియోజకవర్గంలో..

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలోని గ్రామాల్లో శుక్రవారమే వినాయక చవితి సందడి నెలకొంది. పెనుగొండ, మార్టేరు, ఆచంట, సిద్ధాంతం, వడలి గ్రామాల్లో దుకాణాలు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. పత్రి, గణపతి మట్టి ప్రతిమలు, లడ్డూలు, పూల దుకాణాలు ప్రతి గ్రామంలోనూ నూతనంగా వెలిసాయి. పాలవెల్లికి కట్టడానికి పండ్లు, పత్రులు కొనడానికి ప్రజలు ఒకేసారి బయటకు రావడంతో దుకాణాలు కిక్కిరిసి పోయాయి. లడ్డూలు అమ్మకాలు జోరుగా సాగాయి. పండ్లు, పూల ధరలు అధికంగా ఉండడంతో సామాన్యులు ఇబ్బందిపడ్డారు.



పాలకొల్లు సెంట్రల్: ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాల వద్ద మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం



పెనుగొండ: వల్లూరులో మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న దృశ్యం



పాలకొల్లు అర్బన్: ఉల్లంపర్రు కనకదుర్గమ్మ ఆలయం వద్ద మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి అటానమస్ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రాజరాజేశ్వరి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, కలర్స్, కెమికల్స్‌తో చేసిన విగ్రహాల కారణంగా పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. అందువల్ల పర్యావరణహిత వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించాలని కోరారు.కెమిస్ట్రీ లెక్చరర్ వంశీ, జగపతి బాబు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

పాలకొల్లు అర్బన్: పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉల్లంపర్రు కనకదుర్గమ్మ ఆలయం వద్ద వినాయక మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. రోటరీ సభ్యులు చందక రాము, మద్దాల వాసు, పెనుమాక రామమోహన్‌రావు, అత్తోట రవి విరాళంతో 500 మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్, కార్యదర్శి జవ్వాజి కల్యాణ్, పోతాబత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఆచంట మండలం వల్లూరు, పెనుగొండ మండలం పెనుగొండ, వడలిల్లో గణపతి మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలే వినియోగించుకోవాలని సూచించారు. పెనుగొండలో శ్రీనగరేశ్వర మహిషాసురమర్దని వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోనూ, వడలి ఎన్టీఆర్ కూడలిలోనూ, వల్లూరు సంత మార్కెట్‌లోనూ పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో చిట్టూరి శ్రీనివాస్, తోట ఆదినారాయణ, కడిమి ఉమామహేశ్వరరావు, ఉప్పలపాటి చంటి, ఇర్రింకి నాగరాజు, కడిమి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం గ్రామంలో శుక్రవారం జనసేన నాయకులు మట్టి వినాయక ప్రతిమలు పంచారు. కార్యక్రమంలో కొండ్రెడ్డి శేషు, నర్రెడ్డి శ్రీను, సాధనాల శ్రీను, పెచ్చెట్టి సందీప్ పాల్గొన్నారు.